క్లుప్తంగా

శ్రీముఖలింగానికి భక్తుల తాకిడి



ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని మధుకేశ్వర ఆలయానికి వైశాఖి మాసం శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈనెల శివ, కేశవులకు ప్రీతికావడంతో జిల్లా నలుమూలలతోపాటు పక్క జిల్లాలైన విజయనగరం, విశాఖ, ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆమదాలవలస రూరల్: పట్టణంలో మోనింగివారి వీధిలో గల అయ్యప్పస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ సన్నిధిలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను ఆలయ అర్చకులు ఆరవెల్లి భాస్కరశర్మ నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పట్టణ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

కొత్తూరు: ఉపాధి పనుల్లో తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని మేట్లు, క్షేత్ర సహాయకులకు ఎంపీడీఓ త్రివిక్రమరావు హెచ్చరించారు. మండలంలోని బమ్మిడి గ్రామానికి చెందిన శోభనకర్ర చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. పనులకు వచ్చిన ప్రతీ వేతనదారుడు పేరు మస్తర్లో నమోదు చేయాలన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. పనులు వద్ద తాగు నీరు, టెంట్లు ఉంచుకోవాలన్నారు. పనుల్లో సమయపాలన పాటించాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు



అమ్మవారి వేషధారణలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మ తల్లి పెద్ద పండగల సందర్భంగా శనివారం ప్రదర్శించిన వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అమ్మవారి వేషధారణతోపాటు పలు రకాల పగటి వేషాలతో గటాలను ఊరేగింపు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి పండగల్లో భాగంగా ప్రదర్శించిన వేషధారణలు చూసేందుకు పరిసర గ్రామాలకు చెందినవారు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ నెల 28వ తేదీ వరకు అమ్మవారి పండగలను నిర్వహించటం జరుగుతుందన్నారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు



బి.సంధ్య, ఏఓ, హిరమండలం

హిరమండలం: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు కార్యచరణ ప్రణాళిక తయారుచేసి ప్రభుత్వానికి పంపామని, అందుకు అనుగుణంగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బొడ్డేపల్లి సంధ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి 25 క్వింటాల వరకు పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయన్నారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు 10 క్వింటాలు, జనుము 13 క్వింటాలు, పెసర 2 క్వింటాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు ఏపీ సీడ్స్ ద్వారా సాధారణ రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. మండలంలోని ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని కావాల్సిన విత్తనాలను రాయితీపై పొందవచ్చునన్నారు.

వేసవి దుక్కులతో మేలు



వేసవి దుక్కులు చేస్తున్న రైతు

- సస్యరక్షణ చర్యలతో క్రిమికీటకాల నివారణ
- భూసార పరీక్షలు తప్పనిసరి అంటున్న వ్యవసాయశాఖ అధికారులు
- సాగులో మెలకువలు పాటిస్తున్న అన్నదాతలు

ఆమదాలవలస రూరల్: పంట కోతల తరువాత మళ్లీ వర్షాలు కురిసేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. వేసవి దుక్కుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

వేసవిలో పొలాల్లో పంటలు సాగులో ఉండవు. చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమిని ఆశ్రయిస్తాయి. వరి, అపరాలు వంటి పంటలకు ఆశించే తెగుళ్ల, పచ్చ పురుగు, లద్దె పురుగు వంటివి భూమిలో ఉంటాయి. వేసవిలో లోతుగా దుక్కులు వేయడం వల్ల నేలలో ఉన్న చీడ పురుగుల కోశాలు, గుడ్లు బయటపడి వేడికి చనిపోతాయి. కొంగలు, కాకులు మొదలైన పక్షులు వాటిని తిని నాశనం చేస్తాయి. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతుగా దుక్కులను చేయడంతో పురుగు మందుల వ్యయం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటలు కోసిన తరువాత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోకి ఇంకుతుంది. ఈ దుక్కుల వల్ల ఇతర గడ్డిజాతి మొక్క విత్తనాలు వేసవి ఉష్ణోగ్రతలకు గురై మొలిచే శక్తిని కోల్పోతాయి. వేసవి దుక్కులు చేపట్టడానికి మే నెలలో అనువైన సమయం, ఇప్పుడు దుక్కులు చేపట్టడం వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. భూమిలో అడుగుబాగాన ఉన్న గడ్డిమూలాలు వర్షం పడగానే పెరిగిన పంటను దెబ్బతీస్తాయి. వీటిని నివారించడానికి వేసవి సమయంలో పొలాల్లో ఒకటిన్నర అడుగు లోతు వరకు రెండు మడకలతో వేసవి దుక్కులు చేపట్టాలి. దీనివల్ల భూమి లోపల ఉన్న శిలీంద్ర సిద్ధ బీజాలతో పాటు, గడ్డిమూలాలు కూడా బయటపడి అధిక ఉష్ణోగ్రతకు నశించిపోతాయి. వేసవి దుక్కులు చేపట్టడం వల్ల భూమి వదులుగా మారి వర్షం పడినప్పుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటుంది. దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలంలో జల్లుకోవాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కులు వల్ల భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయటపడి కీటకాలు నశిస్తాయి. దీని వల్ల పురుగుల మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటల కోత తరువాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం అర్బీకేల్లోనే అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలి. భూసార పరీక్షలు వల్ల ఎరువుల వాడకం తగిన రీతిలో పంటలకు వేసుకోవచ్చు.

– మెట్ట మోహనరావు, వ్యవసాయాధికారి, ఆమదాలవలస మండలం

ఆదమరిస్తే అంతే..!



ఇస్కలపాలెం సమీపంలోని రహదారి పక్కన ఏర్పడిన గొయ్యి

సరుబుజ్జిలి: ఇటీవల కురిన వర్షాలకు రహదారులకు ఇరువైపులా ఉన్న బెర్మ్‌లు కరిగిపోయి ప్రమాదస్థితిని తలపిస్తున్నాయి. మండలంలోని ఏబీ రోడ్డు నుంచి సవలాపురం జంక్షన్, యరగాం ఆర్అండ్‌బీ రహదారిలో పలు చోట్ల రహదారి బెర్మ్‌లు పాడయ్యాయి. వాహనదారులు భయపడుతూ ప్రయాణాలు చేస్తున్నారు. రోడ్డు పక్కన పెద్దగోతులు ఏర్పడి వాహనాలు పక్కకు జరిగే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

షిర్డీలో శ్రేయ మిశ్రో నృత్య ప్రదర్శన



శ్రేయను సత్కరిస్తున్న సునీల్ విశాల్

పాతపట్నం: షిర్డీ దేవాలయ ద్వారకామయి కళాప్రాంగణంలో నాట్యాచార్యులు అర్చన ఉషశ్రీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జాతీయ అవార్డు గ్రహీత, దివ్యాంగురాలైన శ్రేయ మిశ్రో ప్రతిభ కనబరిచింది. శ్రేయ ప్లేటుపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యానికి పలువురు ప్రశంసల వర్షం కురిపించారు. ఆలయ శాఖ నిర్వహకుడు సునీల్ విశాల్, కమిటీ సభ్యులు శ్రేయ మిశ్రోను సత్కరించారు.

ట్రాఫిక్ కష్టాలు



ఇరుక్కున్న వాహనాలు

సారవకోట: మండలంలోని అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ కూడలికి అనుకుని దుకాణాలు ఉండటంతో సరుకులతో వచ్చే భారీ లారీలు రోడ్డుకు పక్కనే నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆక్రమణలు చేపట్టి రోడ్డుకు పక్కనే కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడం, సుమారు 10 వరకు రైస్ మిల్లులు ఉండటం, ఈ మిల్లులకు భారీ లారీలు వస్తుండటంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఉంటుంది. గతంలో పోలీసులు దీనిపై దృష్టి సారించి హెచ్చరికలు జారీ చేసినా వారం, 10 రోజులపాటు బాగానే ఉంది. అనంతరం పాత విధానాలే పాటిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు.

గణితంపై భయం వీడాలి



మాట్లాడుతున్న రీసోర్స్‌పర్సన్ సురేష్

ఎచ్చెర్ల క్యాంపస్: గణితం సబ్జెక్టుపై విద్యార్థులకు ఆసక్తి అవసరమణి రీసోర్స్‌పర్సన్ ముద్దాడ సురేష్ కుమార్ అన్నారు. ధర్మవరం గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఈ శిబిరంలో భాగంగా గణితం సబ్జెక్టుపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎక్కాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, గణితంలో పాఠ్యాంశాలకు సంబంధించిన సూత్రాలు కీలకమన్నారు. శాతాలు, సంఖ్యా వ్యవస్థ, డిస్కౌంట్, భారీ వడ్డీ, చక్రవడ్డీ వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. నిరంతర సాధన వల్ల గణితంలో పట్టు వస్తుందన్నారు. గణితంపై భయం వద్దని చెప్పారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్, సహాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

అన్నపూర్ణ సేవకు రూ.10 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణానికి చెందిన సీనియర్ అడ్వకేట్ ఎస్.వి.శేషగిరిరావు రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని అన్నపూర్ణ పథకం కార్యదర్శి కిల్లాన ఫాల్గుణరావుకు శనివారం అందచేశారు. విరాళం అందించినందుకు సంఘం అధ్యక్షులు గంగుల రమణబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కిల్లాన భోజ్‌కుమార్ ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం విశ్వక్సేన పూజ భగత్ పుణ్యాహవాచనం, పరిషత్ విజ్ఞాపన, ఋత్విక్‌వరణం, రక్షా సూత్రాధారణ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పెద్దపేట, బొంతలవీధి, కలివరపుపేటలో శోభా యాత్ర నిర్వహించారు. మహిళా భక్తులతో పాటు పలువురు పండితులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం హంస వాహన సేవ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు కోరారు.



యాత్రలో పాల్గొన్న మహిళలు



స్వామి శోభాయాత్ర

కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండలం దూసిపేటలో గల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవాలు ఆలయ ధర్మకర్త, గ్రామస్తుల సహకారంతో వేద పండితుల సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారని లైన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ తెలిపారు. ప్రతీ సంవత్సరం వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టాన్నారు. ఈ సందర్భంగా దేవాలయ ధర్మకర్త శ్రీరంగనాయకులు మాట్లాడుతూ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఎవరైతే కనులారా వీక్షిస్తారో వారికి కన్నుల పండగేనన్నారు. వేద పండితులతోపాటు గ్రామస్తుల మధ్య మహోత్సవాన్ని వీక్షించటం ఆనందంగా ఉందన్నారు. కల్యాణ మహోత్సవ అనంతరం భక్తులకు అన్నవితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ మహా వైభవాన్ని తిలకించేందుకు ఆముదాలవలస పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిపోతున్న కలప

- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అటవీశాఖ అధికారులు



నారాయణపురం వద్ద ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

బూర్జ: కలప అక్రమంగా తరలిపోతుంది. టేకు, ఏగిస, బల్ల సిరిసమ, గుగ్గిలం, నిద్రగన్నేరు వంటి విలువైన కలప ప్రతీ రోజు ఆదేపనిగా తరలిస్తున్నారు. అటవీశాఖ అధికార్లు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుదూర ప్రాంతాలైన సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, జలుమూరు, చల్లపేట మండలాల నుంచి బూర్జ మండలం నారాయణపురం నాగావళి నది పైన ఉన్న బ్రిడ్జి మీదుగా సంతకవిటి, రాజాం మండలాలకు ప్రతీ రోజు విలువైన కలప ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకోవపోవడంతో వ్యాపారస్తులు ప్రతీరోజు సాయంత్రం 6.30 గంటలు దాటిన తరువాత యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రభుత్వం మొక్కల పెంపకం కోసం అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం లేదని అంటున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



యలమంచిలివద్ద గోగు గొప్పలు తవ్వుతున్న కూలీలు

జలుమూరు: ఇటీవల కురిసిన వర్షాలకు గోగు (జనుము) గొప్పల పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని విత్తనాలు వేసిన రైతులు ఇప్పుడు కలుపు నివారణతోపాటు కూలీలను పెట్టి గొప్పులు కూడా తవ్విస్తున్నారు. గోగు ప్రస్తుతం మొక్కదశ దాటి ఆకులు తొడిగిన సమయంలో గొప్పులు, కలుపు నివారణ, మొదటి ఎరువు వేస్తే ఏపుగా పెరిగి దిగబడులు సాధించవచ్చునని గోగుపరిశోధన సంస్థ శాస్త్రవేత్త రాజశేఖర్ తెలిపారు. ఇదే సమయంలో సస్యరక్షణ కూడా చేపడితే మరింత దిగుబడులకు అవకాశాలు ఉంటాయన్నారు. కాలిబాటలు కూడా తీయిడం వల్ల గాలి, వెలుతురు బాగా పంట చేల్లోకి వెళ్లి మొక్క ఏపుగా పెరిగేందుకు ఉపయోగపడుతుందన్నారు. మండల పరిధిలో అక్కురాడ, యలమంచిలి, కామినాయుడుపేట, కొండపోలవలస, మహ్మద్‌పురం, లచ్చన్నపేట గ్రామాల్లో గోగు గొప్పులు జరుగుతుండగా ఇదే సమయంలో కూలీలకు డిమాండ్ కూడా పెరిగిందని రైతులు చెబుతున్నారు.

సామూహిక కుంకుమార్చనలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

కొత్తూరు: కొత్తూరులోని వరప్రద వెంకటేశ్వర స్వామి ఆలయంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి పురస్కరించుకొని శనివారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మామర్తి శ్రీకృష్ణమాచార్యులు వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటి సభ్యులు, టీటీడీ ఆధ్యాత్మిక మండలి మండల కమిటీ కన్వీనర్ పొగిరి రవి పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట గ్రామానికి చెందిన మొదలవలస నిహాస్ కాశ్యప్ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయితో మెరిశాడు. ఈ ఏడాది జనవరి 28వ తేదీన జరిగిన పరీక్షలో 300 మార్కులకు 265 సాధించి ఆలిండియాస్థాయిలో రెండువేల ర్యాంకు సాధించాడు. దీంతో ఐదు స్కూళ్లలో సీటు దక్కగా.. చివరకు చిత్తూరు జిల్లాలోని కలికిరి సైనిక్ స్కూల్‌లో అడ్మిషన్‌కు అంగీకరించారు. కేశవరావుపేటకు చెందిన మొదలవలస వంశీకృష్ణ, లక్ష్మి తల్లిదండ్రులు. నిహాస్ కాశ్యప్ తండ్రి వంశీకృష్ణ ఓ కార్పొరేట్ సంస్థలో ఉన్నత ఉద్యోగం చేస్తుండగా.. తల్లి లక్ష్మి గృహిణి.

వేదవిద్యకు ఊపిరి

శ్రీకాకుళం కల్చరల్: వేదవిద్యకు ఊపిరి పోసిన మహానుభావులు విద్యారణ్యులని ప్రముఖ వక్త భాస్కరభట్ల శ్రీరామశర్మ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో మహానుభావుల జయంతి వేడుకలలో భాగంగా విద్యారణ్యుల కోసం ఆయన శనివారం ప్రసంగించారు. వేదాంత పంచదశి, అనుభూతి ప్రకాశము తదితర రచనల ద్వారా ప్రజలలో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించారని అన్నారు. ముందుగా వక్త శ్రీరామశర్మని మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మణికొండ రామారావు, ఎస్.నారాయణమూర్తి, పప్పు పతంజలి శాస్త్రి, పి.అప్పలకొండ, ఎం.శ్రీనివాసరావు, బాబూరావు, ఈశ్వరరావు, సంగమేశ్వరరావు ఉన్నారు.